

# కాళేశ్వరం పేరుతో కేసీఆర్‌ను హింసించడమే మీ లక్ష్యం

## కాంగ్రెస్‌పై మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజం

## ఖమ్మంలో హరీష్ ప్రసంగానికి భారీ స్పందన



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ముఖ్యమంత్రి పీఠమెక్కిన రేవంత్ రెడ్డి కేవలం కాళేశ్వరం పేరుతో కేసీఆర్ ను హింసించమే లక్ష్యంగా పెట్టుకున్నాడని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం తెలంగాణ భవన్లో ఆయన 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ పాలనను గాలికొదిలి ఢిల్లీ యాత్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. వాస్తవాలు లేకుండా వండి వార్చిన రిపోర్టే కాళేశ్వరం రిపోర్ట్ అని కామెంట్ చేశారు. ప్రభుత్వం నుంచి ఏ పనులు చేపట్టినా బిల్లు పాస్ కావాలంటే మంత్రులకు 10 నుంచి 12 శాతం కమీషన్లు ముట్టజెప్పాల్సిన దుస్థితి వచ్చిందని అన్నారు. జస్టిస్ చంద్రఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్టు పూర్తి ఏకపక్షంగా ఉందని అన్నారు. అదొక బేస్స్ రిపోర్టు అని హరీశ్ రావు ఫైర్ అయ్యారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలన అస్తవ్యస్తంగా తయారైందని కామెంట్ చేశారు. రైతులు కనీసం సాగు నీరు కూడా లేదని.. సరిపడా యూరియా ఇచ్చిన పాపాన పోలేదని హరీశ్ రావు ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కమిషన్ల పాలన సాగుతోందిన హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ప్రధాన ప్రతిపక్షంపై కక్ష సాధింపు కోసమే రాజకీయ కమిషన్లు వేశారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీఆర్ఎస్ పార్టీపై కుట్రలకు తెర లేపాయని ఫైర్ అయ్యారు. పొరుగు రాష్ట్రంలో పోలవరం మూడు సార్లు కూలినా కేంద్ర సంస్థ అయినా ఎన్డీఎస్ఏ అక్కడి వెళ్లలేదని.. కనీసం రిపోర్టు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. మంగళవారం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుట్ర పూరితంగా రేవంత్ సర్కార్ కాళేశ్వరం రిపోర్టును బయటపెట్టిందని ధ్వజమెత్తారు. కమిషన్ విచారణలపై మాకు నోటీసులు రాకముందే మీడియాకు తెలిసేది కాదని అన్నారు. నిన్న బయట పెట్టిన రిపోర్టులో అన్ని అబద్ధాలు, అవాస్తవాలు ఉన్నాయని అన్నారు. ఒకవేళ



అసెంబ్లీలో 655 పేజీల రిపోర్టును బయట పెడితే.. చీల్చిచెండాడుతామని హరీశ్ ప్రభుత్వానికి హరీశ్ రావు సవాల్ విసిరారు. ప్రాజెక్టుపై నిజాలన్నీ కాళేశ్వరం ఆసలు అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరిస్తానని అన్నారు. రిపోర్టులో కేవలం తమకు అనుకూలంగా ఉన్న విషయాలనే నిన్న బయటపెట్టారని విమర్శలు గుప్పించారు.

**అది మా నిర్ణయం కాదు..**

దేశంలో చాలా ప్రభుత్వాలు కమిషన్లు వేశాయని.. అవి న్యాయస్థానాల ముందు నిలబడలేదని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో ఏవో ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రేవంత్ రెడ్డి కమిషన్ల నివేదికల పేరుతో మీడియాకు లీకులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. అంతిమంగా కేసీఆర్ను హింసించాలన్నదే రేవంత్ రెడ్డి అజెండా అని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో తమ్మిడిహట్టి దగ్గర అప్పటి కాంగ్రెస్ సర్కార్ తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని అన్నారు. అక్కడ నీటి లభ్యత లేకపోవడం, మహారాష్ట్ర సర్కార్ అభ్యంతరాలు, జీవ సంపదకు విఘాతం పేరుతో అక్కడ ప్రాజెక్టును నిర్మించేందుకు సాధ్యపడలేదని తెలిపారు. ప్రాజెక్టును తమ్మడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం తమ నిర్ణయం కాదన్నారు. సీడబ్ల్యూసీ ఇచ్చిన రిపోర్టు ప్రకారమే ముందుకు వెళ్లామని తెలిపారు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే కేసీఆర్ రాష్ట్రంలో కరెంట్ కోత లేకుండా చేశారని పేర్కొన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఎకరానికైనా ఇదే రేవంత్ సర్కార్ నీరిచ్చిందా అని హరీశ్ రావు ప్రశ్నించారు.

**ఆ విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు..**

ఢిల్లీకి కమీషన్ల మూటలు తీసుకెళ్లడమే సీఎం రేవంత్ రెడ్డికి తెలిసిన విద్య అని తెలంగాణ రాష్ట్రానికి ఆయన చేసింది శూన్యమని హరీశ్ రావు అన్నారు. గతంలో కాటన్ బ్యారేజీ కట్టినా.. ఇదే కాంగ్రెస్ పార్టీ కమిషన్ వేసి వేధించిందని గుర్తు చేశారు. అయినా.. కాటన్ దొర గోదావరి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారని తెలిపారు. తెలంగాణలో కూడా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ను నిర్మించిన కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. కాళేశ్వరం తెలంగాణ జీవధార అనే విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసని.. కావాలనే డ్రామాలు ఆడుతున్నారని హరీశ్ రావు ఫైర్ అయ్యారు.

**హరీష్ రావు ప్రసంగానికి ఖమ్మంలో విశేష స్పందన**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాళేశ్వరంపై మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వీక్షించేందుకు పెద్ద ఎత్తున హాజరైన ఖమ్మం జిల్లా గులాబీ పార్టీ శ్రేణులు..ప్రెజెంటేషన్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వచ్చిన గులాబీ శ్రేణులకు ప్రెజెంటేషన్ ఉద్దేశాన్ని వివరించిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ ..తెలంగాణ ఉద్యమానికి పూర్తి మద్దతు మరియు సహాయ సహకారాలు అందించిన జార్కండ్ రాష్ట్ర సాధకుడు శిబూ సోరేన్ అకాల మరణం పట్ల సమావేశం సంతాపం ప్రకటించింది. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుండి వందలాదిగా తరలివచ్చిన ముఖ్య నాయకులతో ఉత్సాహ భరితంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, బానోతు చంద్రావతి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖమర్, ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, బి.ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, వీరు నాయక్, పెంట్యాల పుల్లయ్య, రాపూరి శ్రీనివాసరావు, కరమూరి వెంకటేశ్వరరావు, భాష బోయిన వీరన్న, బాణాల వెంకటేశ్వర్లు కనకాల వెంకటరావు, వీర మోహన్ రెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, నాయకులు ఉప్పల వెంకటరమణ, ఆర్.జె.సి కృష్ణ, కర్ణాటి కృష్ణ, గిరిబాబు నాయక్, బానోత్ మంజుల



నాయక్, ముత్యాల వెంకట అప్పారావు, డోగుపర్తి సుబ్బారావు, మైనార్టీ నాయకులు తాజుద్దీన్, షేక్ మక్బూల్, జ్యోతి రెడ్డి, మహమ్మద్ రఫీ, ఆసిఫ్ పాషా, షేక్ సద్దాం , హెచ్ ప్రసాద్, మాటే కిరణ్, షారుక్, కార్పొరేటర్లు, తెలంగాణ ఉద్యమకారులు, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా, ఖమ్మం నియోజవర్గాల పార్టీ ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.